తుది టెస్టులో రాణాకు చోటు!

ముంబై: దేశవాళీలో నిలకడగా రాణిస్తున్న ఢిల్లీ పేసర్ హర్షిత్ రాణా టెస్టులలో అరంగేట్రం చేసేందుకు సిద్ధమయ్యాడు. న్యూజిలాండ్‌తో స్వదేశంలో జరుగుతున్న మూడు టెస్టుల సిరీస్‌ను ఇదివరకే 0-2తో కోల్పోయిన భారత జట్టు వాంఖడే వేదికగా శుక్రవారం నుంచి జరుగబోయే మూడో టెస్టులో ఈ యువ పేసర్‌ను ఆడించనున్నట్టు తెలుస్తోంది. వాంఖడే టెస్టుకు ముందు రాణాను జట్టులో చేర్చడంతో బుమ్రాకు విశ్రాంతినిచ్చి అతడిని ఆడించేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. ముగ్గురు పేసర్లతో బరిలోకి దిగాలని చూస్తున్న టీమ్‌ఇండియా.. సిరాజ్, ఆకాశ్‌తో పాటు రాణాను ఆడించాలని భావిస్తోంది.

మాథ్యూ వేడ్ రిటైర్మెంట్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా వెటరన్ వికెట్ కీపర్ బ్యాటర్ మాథ్యూ వేడ్ అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌కు ముగింపు పలికాడు. 13 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఆసీస్ తరపున 97 వన్డేలు, 92 టీ20లు, 36 టెస్టులు ఆడిన వేడ్.. మూడు ఫార్మాట్లలో కలిపి 4,682 పరుగులు చేశాడు. 2021లో ఆసీస్ గెలిచిన టీ20 ప్రపంచకప్‌లో వేడ్ కీలకపాత్ర పోషించాడు.

టోనీ, ట్రిస్టన్ శతక జోరు

చట్టోగ్రమ్: దక్షిణాఫ్రికా యువ బ్యాటర్లు టోనీ డి జార్జి (141 నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్ (106) శతకాలతో మెరవడంతో బంగ్లాదేశ్‌తో చట్టోగ్రమ్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో సఫారీలు భారీ స్కోరు దిశగా సాగుతున్నారు. తొలి రోజు ఆటలో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు వచ్చిన సౌతాఫ్రికాకు జార్జి, సారథి మార్క్‌రమ్ (33) తొలి వికెట్‌కు 69 పరుగులు జత చేసి శుభారంభాన్ని అందించారు. వన్ డౌన్‌లో వచ్చిన స్టబ్స్‌తో కలిసి జార్జి బంగ్లా బౌలర్లను ఆటాడుకున్నాడు. ఈ ఇద్దరూ టెస్టుల్లో తొలి శతకాలతో పాటు 201 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పడంతో దక్షిణాఫ్రికా 2 వికెట్ల నష్టానికి 307 పరుగులు చేసింది.

స్మృతి శతకాల సంఖ్య. ఈ సెంచరీతో ఆమె భారత్ తరపున వన్డేలలో అత్యధిక శతకాలు చేసిన మిథాలీ రాజ్ (7/211 ఇన్నింగ్స్‌లలో) రికార్డును అధిగమించింది. 88 ఇన్నింగ్స్‌లలోనే స్మృతి ఈ ఘనతను అందుకుంది.

8

మంధాన (100)

మంధాన మెరుపులు

- సూపర్ సెంచరీతో విజృంభణ
- చివరి వన్డేలో న్యూజిలాండ్‌పై ఘన విజయం
- 2-1తో సిరీస్ భారత్ కైవసం

భారత పర్యటనకు వచ్చిన న్యూజిలాండ్ పురుషుల జట్టు రోహిత్ సేనకు కొరకరాని కొయ్యగా మారి టెస్టు సిరీస్‌ను ఒడిసిపట్టుకున్నా.. టీ20 ప్రపంచ చాంపియన్లుగా ఇక్కడకు వచ్చిన కివీస్ అమ్మాయిల జట్టుకు మాత్రం హర్మన్‌ప్రీత్ కౌర్ సేన అనూహ్య షాకిచ్చింది. అబ్బాయిలు సిరీస్ కోల్పోయినా అమ్మాయిలు మాత్రం వదల్లేదు. అహ్మదాబాద్ వేదికగా జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను భారత్ 2-1తో గెలుచుకుంది. కీలక మ్యాచ్‌లో స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన రికార్డు శతకంతో మెరవగా హర్మన్‌ప్రీత్ కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడింది.

అహ్మదాబాద్: భారత్, న్యూజిలాండ్ మహిళల క్రికెట్ జట్ల మధ్య జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను టీమ్‌ఇండియా 2-1తో గెలుచుకుంది. మంగళవారం ముగిసిన సిరీస్ నిర్ణయాత్మక మూడో వన్డేలో భారత్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. గత రెండు మ్యాచ్‌లలో విఫలమైన స్మృతి మంధాన (122 బంతుల్లో 100, 10 ఫోర్లు) శతకానికి తోడు హర్మన్‌ప్రీత్ (63 బంతుల్లో 59 నాటౌట్, 6 ఫోర్లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడటంతో కివీస్ నిర్దేశించిన 233 పరుగుల లక్ష్యాన్ని భారత్ 44.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కీలక ఇన్నింగ్స్ ఆడిన మంధానకే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కగా దీప్తి శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' లభించింది. అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన కివీస్ 49.5 ఓవర్లలో 232 పరుగులకు ఆలౌట్ అయింది. బ్రూక్ హ్యాలీడే (96 బంతుల్లో 86, 9 ఫోర్లు, 3 సిక్సర్లు), జార్జియా ప్లిమ్మర్ (67 బంతుల్లో 39, 6 ఫోర్లు) రాణించారు.

ఆదుకున్న బ్రూక్

టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న కివీస్‌కు ఆదిలోనే వరుస షాకులు తాకాయి. గత మ్యాచ్‌లో అర్ధ సెంచరీలతో కదం తొక్కిన సుజీ బేట్స్ (4), కెప్టెన్ సోఫీ డివైన్ (1)తో పాటు లారెన్ (1) తడబడ్డారు. జెమీమా రోడ్రిగ్స్ మెరుపు ఫీల్డింగ్‌తో సుజీని రనౌట్ చేసింది. 11 ఓవర్లలోపే ఆ జట్టు మూడు కీలక వికెట్లు కోల్పోవడంతో క్రీజులోకి వచ్చిన బ్రూక్ సంయమనంతో ఆడింది. ఓపెనర్ ప్లిమ్మర్ (39)తో కలిసి నాలుగో వికెట్‌కు 30 పరుగులు జోడించిన ఆమె వికెట్ కీపర్ ఇసాబెల్ల గేజ్ (25)తో 64 పరుగులు జతచేసింది. 72 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న బ్రూక్.. ఆఖరి ఓవర్లలో నిష్క్రమించినా లీ తహుహు (24 నాటౌట్) వేగంగా ఆడి కివీస్‌కు పోరాడే స్కోరును అందించింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ (3/39), ప్రియా మిశ్రా (2/41) రాణించారు.

మెరిసిన మంధాన

గత రెండు మ్యాచ్‌లలో నిరాశపరిచిన స్మృతి మంధాన కీలక మ్యాచ్‌లో మాత్రం సత్తా చాటింది. షఫాలీ (12) మరోసారి విఫలమైనా మంధాన మాత్రం క్రీజులో కుదురుకునేదాకా ఆచితూచి ఆడింది. వన్‌డౌన్‌లో వచ్చిన యస్తికా భాటియా (35)తో కలిసి రెండో వికెట్‌కు 76 పరుగులు జోడించింది. ఈ ఇద్దరూ కివీస్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. అర్ధ సెంచరీ దిశగా సాగుతున్న యస్తికా.. డివిన్ వేసిన 21వ ఓవర్లో ఆఖరి బంతికి ఆమెకే రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. ఈ క్రమంలో హర్మన్‌ప్రీత్‌తో జత కలిసిన మంధాన.. బ్యాట్‌కు పనిచెప్పింది. 73 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న ఆమె.. ఆ తర్వాత జోరు పెంచింది. డివిన్ 37వ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు కొట్టి 90లలోకి వచ్చిన మంధాన.. కార్సన్ 40వ ఓవర్లో లాంగాఫ్ దిశగా సింగిల్ తీసి కెరీర్‌లో 8వ శతకాన్ని పూర్తిచేసింది. సెంచరీ తర్వాత మరుసటి బంతికే ఆమె పెవిలియన్ చేరినా జెమీమా రోడ్రిగ్స్ (22), హర్మన్‌ప్రీత్ భారత్‌ను విజయతీరాలకు చేర్చారు.

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్: 49.5 ఓవర్లలో 232 ఆలౌట్ (బ్రూక్ 86, ప్లిమ్మర్ 39, దీప్తి 3/39, ప్రియా 2/41) **భారత్:** 44.2 ఓవర్లలో 236/4 (మంధాన 100, హర్మన్‌ప్రీత్ 59 నాటౌట్, హన్నా 2/47, డివైన్ 1/44)

హైదరాబాద్ బోణీ

పుదుచ్చేరిపై ఘన విజయం

తనయ్ (7/106)

హైదరాబాద్ ఆట ప్రతినిధి: దేశవాళీ ప్రతిష్టాత్మక రంజీ సీజన్‌లో హైదరాబాద్ బోణీ కొట్టింది. ఎలైట్ గ్రూప్-బీలో ఉన్న హైదరాబాద్.. ఉప్పల్‌లో పుదుచ్చేరితో జరిగిన మ్యాచ్‌లో ఇన్నింగ్స్ 50 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఓవర్ నైట్ స్కోరు 171/2 వద్ద నాలుగో రోజు ఆరంభించిన పుదుచ్చేరి.. 333 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులో ఓపెనర్ గంగ శ్రీధర్ రాజు (106) శతకంతో మెరిశాడు. హైదరాబాద్ బౌలర్లలో తనయ్ త్యాగరాజన్ (7/106) ఏడు వికెట్లతో మెరిసి ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. తనయ్‌కే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

పాటిదార్ మెరుపు శతకం

ఇండోర్: మధ్యప్రదేశ్ బ్యాటర్ రజత్ పాటిదార్ రంజీలలో ధనాధన్ ఆటతో మెరుపు శతకం బాదాడు. హర్యానాతో జరిగిన మ్యాచ్‌లో అతడు 68 బంతుల్లోనే సెంచరీ (102 బంతుల్లో 159, 13 ఫోర్లు, 7 సిక్సర్లు) సాధించాడు. రంజీలలో ఇది ఐదో అత్యంత వేగవంతమైన శతకం. 2016 సీజన్‌లో పంత్ 48 బంతుల్లోనే త రంజీల్లో వేగవంతమైన శతకాన్ని నమోదుచేశాడు.

శభాష్ హరికృష్ణ, వంశీ

ప్లేయర్లకు సీఎం రేవంతర్‌రెడ్డి అభినందన

హైదరాబాద్, అక్టోబర్ 29(నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ స్థాయిలో దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసేలా రాణించిన రాష్ట్ర ప్లేయర్లు పెంటాల హరికృష్ణ, మోడెం వంశీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. మంగళవారం తన నివాసంలో ఇద్దరు ప్లేయర్ల ప్రతిభను ఆయన కొనియాడారు. బుడాపెస్ట్(హంగరీ) వేదికగా జరిగిన ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణ చరిత్ర లిఖించిన భారత జట్టులో హరికృష్ణ సభ్యుడు కాగా, కామన్వెల్త్ పవర్‌లిఫ్టింగ్ టోర్నీలో భద్రాచలానికి చెందిన వంశీ పసిడి పతకంతో మెరిశాడు. మరోవైపు భారత సీనియర్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ తన వివాహ ఆహ్వాన పత్రాన్ని సీఎం అందజేశాడు. ఈ కార్యక్రమంలో సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, ఎంపీ బలరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కోహ్లీ నన్ను బ్లాక్ చేశాడు: మ్యాక్స్‌వెల్

మెల్‌బోర్న్: భారత క్రికెటర్ విరాట్ కోహ్లీని ఎగతాళి చేసినందుకు గాను ఇన్‌స్టాగ్రామ్‌లో చాలా రోజుల పాటు అతడు తనను బ్లాక్ చేశాడని ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ అన్నాడు. మ్యాక్సీ ఓ పోడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. ''నేను ఆర్సీబీకి వెళ్లినప్పుడు (2021లో) నాకు మొదటగా మెసేజ్ చేసింది కోహ్లీనే. ప్రీ ఐపీఎల్ ట్రైనింగ్ క్యాంప్ సందర్భంగా మేం చాలా విషయాలు మాట్లాడుకున్నాం. అయితే నేను ఇన్‌స్టాగ్రామ్‌లో కోహ్లీని ఫాలో అవడం మొదలుపెట్టాను. కానీ కోహ్లీకి సంబంధించిన పోస్టులేవీ నాకు కనిపించకపోయేవి. అప్పుడే అతడు నన్ను బ్లాక్ చేశాడని తెలిసింది. 'అవును. నువ్వు నన్ను ఎగతాళి చేసినందుకు అలా చేశానన్నాడు. కానీ ఆ తర్వాత అన్‌బ్లాక్ చేశాడు' అని తెలిపాడు.

గిల్, రషీద్..గుజరాత్‌తోనే!

న్యూఢిల్లీ: కెప్టెన్ శుభ్‌మన్ గిల్, స్టార్ స్పిన్నర్ రషీద్‌ఖాన్, సుదర్శన్‌ను ఐపీఎల్ మాజీ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ అట్టిపెట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. వీరికి తోడు హార్దిక్ పాండ్యా, రాహుల్ తెవాటియా, షారుఖ్‌ఖాన్‌ను తిరిగి తీసుకునే సూచనలు ఉన్నాయి. భవిష్యత్ భారత కెప్టెన్‌గా భావిస్తున్న గిల్‌పై టైటాన్స్ భారీ ఆశలు పెట్టుకుంది. హార్దిక్ నిష్క్రమణతో గత సీజన్‌లో గిల్ జట్టును ముందుండి నడిపించాడు.

రోడ్రికి బాలన్ డి ఓర్ పురస్కారం

పారిస్: ఫుట్‌బాల్‌లో ప్రతిష్టాత్మక అవార్డు అయిన 'బాలన్ డి ఓర్'ను ఈ ఏడాది స్పెయిన్ ఫుట్‌బాలర్ రోడ్రిగొ హెర్నాండెజ్ (రోడ్రి) గెలుచుకున్నాడు. సోమవారం రాత్రి పారిస్‌లోని థియేటర్ డు చాట్‌లెట్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో రోడ్రి ఈ అవార్డును అందుకున్నాడు. స్పెయిన్ దేశస్తుడైన రోడ్రి.. ఇంగ్లీష్ ప్రీమియర్ లీగ్ (ఈపీఎల్)లో మాంచెస్టర్ సిటీకి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఈ ఏడాది మాంచెస్టర్ సిటీ ఈపీఎల్ ట్రోఫీ గెలవడంతో పాటు స్పెయిన్ జట్టు యూరో-2024 కప్ దక్కించుకోవడంలో రోడ్రి కీలకపాత్ర పోషించడంతో అతడికి ఈ అవార్డు దక్కింది. రియల్ మాడ్రిడ్‌కు చెందిన వినిసియస్ జూనియర్, జూడ్ బెల్లింగ్హమ్, డాని కార్వజల్ నుంచి రోడ్రికి తీవ్ర పోటీ ఎదురైంది. మహిళల విభాగంలో స్పెయిన్‌కే చెందిన ఐటానా బొన్మాటీ బాలన్ డి ఓర్‌ను గెలుచుకుంది. స్పెయిన్ యువ సంచలనం లమినె యమాల్‌కు ఉత్తమ యువ ఫుట్‌బాలర్ అవార్డు లభించింది.

ర్యాంకింగ్స్, రేటింగ్ పట్టించుకోను: అర్జున్

చెస్ చాంపియన్స్‌కు ఘన సన్మానం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: మారుతూ ఉండే ర్యాంకింగ్స్, ఎలో రేటింగ్స్ గురించి పెద్దగా పట్టించుకోనని భారత స్టార్ గ్రాండ్ మాస్టర్ ఇరిగేసి అర్జున్ అన్నాడు. ఇటీవల జరిగిన ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత స్వర్ణ చరిత్రలో కీలకంగా వ్యవహరించిన అర్జున్‌తో పాటు హరికృష్ణ, హారిక, శ్రీనాథ్, వంతికా అగర్వాల్‌ను మంగళవారం హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ '2800 ఎలో రేటింగ్ చేరుకోవడం చాలా గర్వంగా ఉంది. భవిష్యత్‌లో ప్రపంచ చాంపియన్ కావాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. రాబోయే మెగాటోర్నీలో గుకేశ్‌కు 80 నుంచి 90 శాతం వరకు టైటిల్ గెలిచే అవకాశాలు ఉన్నాయి' అని అన్నాడు. ప్రవాహ, మైత్రా, ఎంజీడీ1 సంస్థలు చెస్ ప్లేయర్లను సన్మానించాయి.

గొర్రెల మందపై పులి దాడి

రెండు గొర్రెలు మృత్యువాత

హాజీపూర్, అక్టోబర్ 29 : మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని బుగ్గగట్టు సమీపంలో గల మామిడి తోటలో గొర్రెల కాపరి మందను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి గొర్రెల మందపై పెద్ద పులి దాడి చేసింది. ఒక గొర్రెను చంపి దాని రక్తం తాగి, కొంత భాగం తిని వదిలేసింది. మరో గొర్రె పిల్లను నోట పట్టుకుని అడవిలోకి వెళ్లింది. మందలోనే ఓ మూలకు దుప్పట్లు కప్పుకుని పడుకున్న కాపరి మెరుగు శ్రీనివాస్ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఉన్నాడు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. మూడు రోజులుగా పులి గాండ్రింపులు వినిపిస్తున్నాయని, దాడికి ముందు కూడా వినిపించాలని తెలిపారు. మందపై దాడి చేసింది పెద్దపులి అని గొర్రెల కాపరులు అంటుంటే.. అది చిరుత పులి అని అటవీ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. కాగా.. అడుగులను అటవీ శాఖ అధికారులు పరీక్షిస్తున్నారు. పులి దాడిలో చనిపోయిన గొర్రెల విలువ రూ.20 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని శ్రీనివాస్ కోరుతున్నాడు.

బలహీనపడిన అల్పపీడన ఆవర్తనం

- రాబోయే 2 రోజులు రాష్ట్రంలో మోస్తరు వర్షాలు
- స్వల్పంగా పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ఆవర్తనం బలహీనపడినట్టు హైదరాబాద్ వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. దీంతో తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం లేదని, మూడ్రోజుల పాటు తేలికపాటి వర్షాలు కురుస్తాయని చెప్పారు. పగటిపూట వేడి, ఉదయం,సాయంత్రం చల్లగాలులు వీస్తున్నాయి. చాలా ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 18 డిగ్రీలకు పడిపోతున్నాయని తెలిపారు.

- కలెక్టరేట్ ఎదుట ఏఈవోల ధర్నా

డిజిటల్ సర్వే చేస్తేనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన సర్కారు నేటికీ పరిష్కరించకపోవడంతో వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవో) రోడ్డెక్కారు. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు.

– భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ

- రైతన్నపై సర్కార్ వివక్ష

రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా వర్నిలో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం 'రైతు నిరసన' చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ రైతుల పట్ల వివక్ష చూపుతున్నదని మండిపడ్డారు.

– రుద్రూర్

ఉత్తమ ఎంఈవోలకు అవార్డులు

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): వినూత్న ఆలోచనలతో విద్యాభివృద్ధికి కృషిచేసిన మండల విద్యాధికారుల(ఎంఈవోల)కు రాష్ట్రస్థాయిలో అవార్డులిస్తామని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం వెల్లడించారు. 624 మంది ఎంఈవోలకు మంగళవారం హైదరాబాద్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతీ రోజు కనీసంగా రెండు పాఠశాలల చొప్పున సందర్శించాలని ఎంఈవోలను బుర్రా వెంకటేశం ఆదేశించారు. స్కాట్స్, గైడ్స్, జూనియర్ రెడ్‌క్రాస్‌లో చేరేలా విద్యార్థులను ప్రోత్సహించాలని తెలిపారు. పాఠశాలలో 5-6 క్లబ్బులు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా చూడాలని కోరారు. విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి, అదనపు డైరెక్టర్లు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ ద్వారా సీట్లను భర్తీచేయాలి: ఏబీవీపీ

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్ బీ క్యాటగిరీ(మేనేజ్‌మెంట్ కోటా)సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీచేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) కోరింది. వర్సిటీల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులను భర్తీచేయాలని డిమాండ్ చేసింది. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంగళవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించింది. బడ్జెట్‌లో విద్యకు నిధుల శాతాన్ని పెంచాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరారు.

బాలుడి నిజాయితీ

రూ.2 లక్షల విలువైన బంగారు నాను పోలీసులకు అప్పగింత

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 29: నీతి, నిజాయితీ కనుమరుగవుతున్న నేటి కాలంలో రూ.2 లక్షల విలువ చేసే బంగారు నగను తిరిగి అప్పగించి మంచి మనస్సును చాటుకున్నాడో బాలుడు. ఈ ఘటన మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకున్నది. పెద్దకొత్తపల్లి మండలం దేవుని తిర్మలాపూర్‌కు చెందిన పిల్లి చంద్రమ్మ సోమవారం కల్వకోలుకు వెళ్లి రెండు తులాల మూడు మాసాల బంగారు నాను పోగొట్టుకున్నది. మంగళవారం స్కూల్‌కు వెళ్తున్న సాయికుమార్‌కు బంగారం దొరికింది. విషయాన్ని తండ్రి సత్యంకు తెలుపగా.. ఇద్దరూ కలిసి పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి దొరికిన బంగారు నాను అప్పగించారు. ఇద్దరినీ కొల్లాపూర్ సీఐ మహేశ్, ఎస్సై సతీశ్ అభినందించారు. విద్యార్థికి కొత్త బట్టలు, బూట్లు ఇప్పించి సత్కరించారు.

నిజాయితీ చాటుకున్న బాలుడికి కొత్త బట్టలు అందిస్తున్న సీఐ, ఎస్సై

డెహ్రాడూన్‌లో ఆదివాసీ 3వ గొట్టుపై క్షేత్ర పరిశోధన

- మరో పదిరోజులు అధ్యయనం
- సమ్మక్క రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధక బృందం ఆరా

తాడ్వాయి, అక్టోబర్ 29: డెహ్రాడూన్‌లోని హిమాలయాల్లో మంగళవారం ఆదివాసీల 3వ గొట్టుపై సమ్మక్క, సారలమ్మ ఇండిజీనియస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధక బృందం సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశోధన చేపట్టారు. 1925 కి.మీ. మేర ప్రయాణించిన బృందం సభ్యులు.. తపకేశ్వర్‌లో కోయల పూర్వ దేవాలయం, నాగులమ్మ, సమ్మక్క, శివాలయం, నంది దేవాలయాలు ఉన్నాయని చెప్పారు. కొండల నడుమ సంధ్యా నది ప్రవహిస్తున్నదని, దానిలో ఆదివాసీ 3వ గొట్టును తెలియజేసేలా త్రిభుజాకార రాజ్య గుర్తులు ఉన్నాయని, ఇక్కడ 3వ గొట్టు ఆదివాసీలు నివసిస్తున్నట్టు కనుగొన్నట్టు డైరెక్టర్ కాక నర్సింగరావు తెలిపారు. మరో 10 రోజులపాటు పర్యటించి సింధు నది పరీవాహక ప్రాంతంలో పరిశోధనలు చేయనున్నట్టు పేర్కొన్నారు.

ఫోన్ల ట్యాపింగ్ కేసులో భుజంగరావు గైర్హాజరు

వచ్చేనెల 11కు విచారణ వాయిదా

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో రిమాండ్ ఖైదీలుగా కొనసాగుతున్న ప్రణీత్‌రావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావును మంగళవారం జైలు అధికారులు 14వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చారు. ప్రస్తుతం మధ్యంతర బెయిల్‌పై ఉన్న మరో నిందితుడు భుజంగరావు గైర్హాజరు కావడంతో ఆయన తరపు న్యాయవాది గైర్హాజరు పిటిషన్‌ను దాఖలు చేశారు. ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావుతోపాటు ఐన్యూస్ ఎండీ శ్రావణ్‌కుమార్‌పై అరెస్టు వారెంట్ పెండింగ్‌లో ఉండటంతో తదుపరి విచారణను నవంబర్ 11కు వాయిదా వేస్తున్నట్టు కోర్టు ప్రకటించింది.

యూకేలో నర్సింగ్‌కు దరఖాస్తులు

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పనశాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) యూకేలో నర్సింగ్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించింది. వయసుతో నిమిత్తం లేకుండా బీఎన్ఎం/బీఎస్సీ(ఎన్), లిజనింగ్, రీడింగ్, స్పీకింగ్‌లో బీ గ్రేడ్, రైటింగ్‌లో సీ ప్లస్ గ్రేడ్ కలిగినవారు అర్హులని తెలిపింది. నవంబర్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైనవారికి శిక్షణ ఇచ్చిన తరువాత ఉద్యోగాల్లో నియమించనున్నట్టు చెప్పింది. వివరాలకు టామ్‌కామ్ వెబ్‌సైట్‌ను లేదా 8919047600 నంబర్‌ను సంప్రదించవచ్చు.

ఉమామశంకర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై తీర్పు వాయిదా

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో బెయిల్ కోసం మూడో నిందితుడు గజ్జల ఉమాశంకర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. మంగళవారం ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వు చేస్తున్నట్టు జస్టిస్ కే లక్ష్మణ్ ప్రకటించారు. వివేకా హత్య ఘటనలో ఉమాశంకర్‌రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొన్నాడని, ఆయనకు బెయిల్ మంజూరు చేయరాదని సీబీఐ వాదించింది.

జూలూరుపాడులో జరిగిన గ్రామసభలో అధికారులతో మాట్లాడుతున్న సీతారామ ప్రాజెక్టు లింక్ కాలువ భూనిర్వాసితులు

'సీతారామ' పరిహారం 20 లక్షలు ఇవ్వాల్సిందే

- లేకుంటే ప్రాజెక్టు పనులను అడ్డుకుంటామని హెచ్చరిక
- జూలూరుపాడు గ్రామసభలో భూనిర్వాసితుల స్పష్టీకరణ

జూలూరుపాడు, అక్టోబర్ 29: సీతారామ ప్రాజెక్ట్ లింక్ కాలువ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి రూ.20 లక్షల నష్టపరిహారం ఇవ్వకుంటే పనులను అడ్డుకుంటామని భూ నిర్వాసితులు తేల్చిచెప్పారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు పంచాయతీ కార్యాలయంలో భూ నిర్వాసిత రైతులతో పాల్వంచ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జే కాశయ్య అవార్డు విచారణ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.13.50 లక్షల నష్టపరిహారం ఇస్తుందని ప్రకటించారు. దీంతో గ్రామసభకు వచ్చిన రైతులు మాట్లాడుతూ.. ఎకరానికి రూ.20 లక్షల నష్టపరిహారం ఇవ్వకుంటే పనులు జరగనివ్వబోమని హెచ్చరించారు. పర్యటనలో భాగంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇక్కడికి వచ్చినప్పుడు భూనిర్వాసిత రైతులకు ఎకరానికి రూ.20 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. జూలూరుపాడు రెవెన్యూ పరిధిలో 20 మంది రైతులకు చెందిన 28 ఎకరాల భూమి కాలువ నిర్మాణంలో పోతున్నదని చెప్పారు. వీరంతా గ్రామసభకు వచ్చి సంతకాలు పెట్టకుండా వెనుదిరగడంతో ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు. ఈ గ్రామసభలో సీతారామ ప్రాజెక్ట్ డీఈ చంద్రశేఖర్, ఏఈ సాగర్, ఎఫ్ఆర్‌వో